క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెదకాకాని: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామాంజిరెడ్డి అన్నారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో శనివారం వెనిగండ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాంజిరెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో వర్షపునీరు, మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపునకు హాజరైన వారందరికీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ పెదకాకాని మండల కార్యకర్తల సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకానిలోని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నివాసం వద్ద బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండల పార్టీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అనుబంధ విభాగాల బాధ్యతలు చేపట్టిన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



పొన్నూరు: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల కార్యాచరణపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



పెదకాకాని: అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని.. లేకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని గ్రామంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని పెదకాకాని సుందరయ్య కాలనీలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుక్కల చిన్న రాఘవయ్య, బురదగుంట సాంబయ్య, సుందరయ్య కాలనీ వాసులు జెట్టి రాజలక్ష్మి, నాగేశ్వరావు, ఎస్‌కే మస్తానమ్మ, ఎస్ వెంకటరావు, ఎస్ రజిని, కుమారి, వై.విజయ, షేక్ రహంతుల్లా, షేక్ మున్ని పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెదకాకాని: మండలంలోని నంబూరు నుంచి ఉప్పలపాడు వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శంకుస్థాపన చేశారు. అలానే గుంటూరు నందివెలుగు ప్రధాన రోడ్డు నుంచి తంగెళ్లమూడి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు.

స్వచ్ఛ ఆంధ్ర - ఆరోగ్య ఆంధ్ర పోస్టర్లు ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, సైమన్ రాజు, కృష్ణకుమారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో..

గుంటూరు జీజీహెచ్‌లో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన నాటికలు, ప్రతిజ్ఞ చేసి ప్లాస్టిక్‌ను రూపు మాపే కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రారంభించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



కాకుమానులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కాకుమాను: సమాజంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీర రాఘవయ్య అన్నారు. పెదనందిపాడు కళాశాల ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వలన మానవాళికి, భూమికి అనేక అనర్థాలు సంభవిస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ కె.ప్రతాప్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, స్టూడెంట్స్, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని బీకేపాలెంలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాల గురించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఎంపీడీవో కె.యుగకీర్తి, డెప్యూటీ ఎంపీడీవో రవి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలి

పొన్నూరు: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలనే అంశంతో శనివారం పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్లాస్టిక వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 2024 స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులలో పొన్నూరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో 11వ స్థానం లభించడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని కోరుతూ పుర ప్రజలు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరానాయక్, మున్సిపల్ అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో...

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజరు ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి, పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. అనంతరం డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



పొన్నూరు కార్యక్రమంలో కమిషనర్, సీఐ



ప్రత్తిపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు..

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీలు, మానవహారాలను నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలు కార్యక్రమంలో ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దారు శ్రీనివాస శర్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. నారాకోడూరులోని కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.



నారాకోడూరు కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

జాతీయ స్థాయి ఇన్నోవేటివ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థి ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు రూ.20 వేల నగదు పురస్కారం అందుకోవడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడారు. ఇటీవల భారత ప్రభుత్వ గణాంక శాఖ (ఎంవోఎస్‌పీఐ), మైజీవోవీ నిర్వహించిన 'ఇన్నోవేట్ విత్ గోల్‌స్టాట్స్, డేటా విజువలైజేషన్ హ్యాకతాన్' అనే ఆన్‌లైన్ పోటీలలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వివిధ కళాశాలు, యూనివర్సిటీల నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు ఎంట్రీ చేసుకున్నారన్నారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 30 ప్రాజెక్టులకు విజేతలుగా నిర్ణయించారన్నారు. విజేతలైన ప్రాజెక్ట్‌లలో తమ కళాశాలలో డేటా సైన్స్ విభాగం తృతీయ సంవత్సరం చదువుతున్న పి.జయంత్ అందించిన ప్రాజెక్టు నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవీపీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన రోబోటిక్స్, ఏఐపై బూట్ క్యాంప్



ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయా విభాగాల అధిపతులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గత 5 రోజులుగా హాక్ బోట్స్ ఆధ్వర్యంలో ఏఐడీఎస్, సీఎస్‌ఈ ఏఐఎంఎల్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐపై జరుగుతున్న బూట్ క్యాంప్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు హాజరయ్యారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు హ్యాకథాన్‌లు దోహదపడతాయని వివరించారు. డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మలినేని కళాశాల టెక్నాలజీతో ముందంజలో ఉందన్నారు. హాక్‌బోట్స్ సీఈవో మహన్ మాట్లాడుతూ.. నేటి సమాజ శ్రేయస్సుకు ఏఐ టెక్నాలజీ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, ఏఐడీఎస్ హెడ్ డాక్టర్ ఛార్లెస్ జయరావు, సీఎస్‌ఈ ఏఐఎంఎల్ హెడ్ డాక్టర్ డి.రవికిరణ్, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

ప్రత్తిపాడు: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రయాదవ్ అన్నారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్తులు, ప్రమాదాలు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి.. ఎటు వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన ఎన్డీఆర్‌ఎఫ్ బృందం విపత్తుల సమయంలో మనల్ని మనం కాపాడుకోవాల్సిన విధానాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కరుణకుమార్, హెచ్‌ఎం షేక్ అలీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రత్తిపాడు: రోగులకు అత్యుత్తమంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆమె పర్యటించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం రోగులతో మాట్లాడారు. పలు సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలి

ఉప్పరపాలెం(కాకుమాను): 1, 2వ తరగతి విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో-1 కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. మండలంలోని ఉప్పరపాలెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యను ముగించుకుని పాఠశాలలో చేరిన చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తే వారికి సులభంగా అర్థమవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య నీరాజనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శనివారం సాయంత్రం నాట్యాచారిణి కుబేరినీ శిష్య బృందం నృత్య నీరాజనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు పెద్ది శ్రేష్ఠ, పెద్ది సహన, నడింపల్లి ఆద్యాలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఏవీకే సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం వాగ్దేవి గాన బృందం నిర్వాహకురాలు బి.శ్యామల ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది.

నూతన పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణకుమార్

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఏర్పాటుకానున్న నూతన పోలింగ్ స్టేషన్లపై ఏమైనా అభ్యంతరాలుంటే ఆయా పార్టీల ప్రతినిధులు రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీలతో ఆయన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌ను రెండు పోలింగ్ బూత్‌లుగా విభజిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గుంటూరు ఈస్ట్ మండలంలో 17, గుంటూరు వెస్ట్‌లో 22, వట్టిచెరుకూరు మండలంలో ఒకటి, ప్రత్తిపాడు మండలంలో మూడు, పెదనందిపాడులో ఒకటి చొప్పున మొత్తం 44 పోలింగ్ స్టేషన్లను నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సురక్షిత గ్రామ జ్యోతి అవగాహన సదస్సు



అక్రమ రవాణా నియంత్రణపై కల్పిస్తున్న అవగాహన

ప్రత్తిపాడు: గృహ హింస, బాల్య వివాహాలు, అక్రమ రవాణా లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తన బాధ్యతలు, లక్ష్యాలను మరిచిపోకూడదన్నారు. హెచ్‌ఎం జోస్ మేరీ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ల్యాంప్ సంస్థ ప్రతినిధి తురకా మంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు తమ హక్కులు తెలుసుకుని వాటిని బాధ్యతగా భావించాలన్నారు. తొలుత విద్యార్థులకు కామిక్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోవెలమూడి సర్పంచ్ ఆళ్ల సాంబశివరావు, వట్టిచెరుకూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నేడు శాకంబరిగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: స్థానిక శివాలయంలోని భ్రమరాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. శాకంబరీ అలంకరణలో భాగంగా భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించనున్నామని తెలిపారు. భక్తులకు ప్రసాదంగా కదంబ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కృపాకటాక్షములకు పాత్రులు కావాలని డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. శనివారం అలంకరణ ఏర్పాట్లలో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

డెంగీపై అపోహలు విడనాడాలి



ప్రత్తిపాడు: డెంగీ పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ, అపోహలను విడనాడాలని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ జాతీయ డెంగీ మాసోత్సవాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా శనివారం మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కీళ్లు, కండరాల నొప్పులు ఉన్న వారు వెంటనే ఆయా గ్రామాల్లోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని డా.దుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించాలి



నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్లు తీసుకున్న వారు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెకు తీసుకున్న వారు బకాయిలను ఈ నెల 31వ తేదీ లోగా చెల్లించాలని ఆ శాఖ ఈడీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రెవెన్యూ కళ్యాణమండపంలో లోన్లు తీసుకున్న లబ్ధిదారులతో, అద్దె బకాయిలు ఉన్న వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015-16 నుంచి 2018-19 వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 456 మంది లోన్లు, కార్లు తీసుకున్న వారు ఉన్నారని.. వారిలో చాలా మంది లోన్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. వీరికి ష్యూరిటీ ఉన్న వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని.. బకాయిలు చెల్లించకపోతే ఆయా ఉద్యోగుల జీతాల్లో నుంచి లోన్ రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కార్లు తీప్పే వారు కార్ లోన్ కట్టాలని లేని పక్షంలో ఆర్‌టీఓ, పోలీస్ డిపార్ట్‌మెంట్ వారికి చెప్పి కార్లు తిప్పకుండా సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా ఈ నెల 31వ తేదీలోగా షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో తాళాలు వేస్తామని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు క్లాత్ సంచులు వినియోగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ కోసం క్లాత్‌తో తయారు చేసిన సంచులను వినియోగించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ క్లాత్‌తో తయారు చేసిన సంచులను పంపిణీ చేశారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు మాట్లాడుతూ ఐటీసీ సహకారంతో క్లాత్ సంచుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డెప్యూటీ సీఈఓ కృష్ణ పాల్గొన్నారు.

• తాగునీటితో ఆటలా!



రామిరెడ్డితోట రైల్వేట్రాక్ వెంబడి వాల్వ్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు



17వ వార్డు చాకలి గుంట మెయిన్ వాల్వ్ పిట్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు

నెహ్రూనగర్: నగర ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. మరొక పక్క నీరు వృథా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో ప్రైవేట్ వర్కర్లు పెట్టుకుని నగరానికి తాగునీటి సరఫరా చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో సరఫరా విషయంలో నిద్రవస్థలో ఉంటున్నారు. శనివారం 17వ వార్డులో చాకలి గుంట(గాంధీనగర్), మెయిన్ వాల్వ్ పిట్ పగిలిపోయిన 40 నిమిషాలు పాటు తాగునీరు వృథాగా పోయింది. అదే విధంగా రామిరెడ్డితోట రైల్వే ట్రాక్ వెంబడి(మణిపురం బ్రిడ్జి) కింద వాల్ పైపు నుంచి నీరు వదిలిన ప్రతిసారి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోలేదు.

ఔషధ రంగంలో ఉపాధి అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ పట్టభద్రులకు ఔషధ తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్‌లోని ఫార్మావిజ్ ప్రతినిధి షేక్ ముబారక్ పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఔషధ తయారీ రంగంలో ఉపాధి అవకాశాలపై సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం పాల్గొన్నారు.